భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

20, నవంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయండి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ముందుగానే అప్రమత్తమై వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. తక్కువ నీటిని వినియోగిస్తూ మంచి దిగుబడులు సాధించే ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, నీటి వనరులను పొదుపుగా ఉపయోగించుకోవాలని తెలిపారు.

నర్సాపూర్ మండలంలోని రాంజ్య తండా, మొహమ్మదాబాద్ గ్రామాల్లో ఎల్-నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో మాట్లాడి వాతావరణ మార్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల ఎంపికలో పాటించాల్సిన విధానాలను వివరించారు.

ఎల్-నినో కారణంగా వర్షాలు తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగును తగ్గించి జీరో ప్యాడీ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉండే జొన్న, మొక్కజొన్న, పెసర, అలసంద, మినుము, శనగ, నువ్వులు, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆవాలు, కూరగాయల వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని బట్టి పంటలను ఎంచుకుంటే సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.



అలాగే ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, సూక్ష్మ నీటిపారుదల పద్ధతుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్, ఇతర సూక్ష్మ నీటిపారుదల విధానాల ద్వారా నీటిని వృథా కాకుండా పంటలకు అవసరమైన మేరకు అందించవచ్చని తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణకు ప్రతి రైతు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వాతావరణ మార్పులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు చెప్పారు. అధిక నీరు అవసరమయ్యే పంటలపై

మాత్రమే ఆధారపడకుండా, తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం వచ్చే స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక, ఎంపీడీవో భారతి, ఏఈవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌పలు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar